



# నాణ్యత పాటించండి

## -అన్నప్రసాదం, లడ్డూకౌంటర్ల తనిఖీల్లో నూతన ఈఓ శ్యామలరావు

తిరుమల, జూన్ 17(ప్రభాతవార్తప్రతినిధి:
భక్తుల్లో భగవంతుని చూస్తూ వారికి అందించే సేవలను మరింత సంతృప్తికరంగా ఉండాలని , అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదం నాణ్యత మరింత మెరుగుపడాలని నూతన టిటిడి ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం నాణ్యత బాగా ఉండాలని, లడ్డూల్లో దిట్టం మేరకు ఇతర పదార్థాలు ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు కౌంటర్ల వద్ద పరిశుభ్రతను పాటించాలని నిర్దేశం చేశారు. నూతనంగా టిటిడి ఈఓగా బాద్యతలు చేపట్టిన తరువాత శ్యామలరావు జెఈఓలతో కలసి వరుస తనిఖీలు చేస్తున్నారు. సోమవారం ఉదయం ఆయన తిరుమలలో లడ్డూకౌంటర్లు, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు, క్యూలైన్లను తనిఖీ చేశారు. వసతి గృహాల గదులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జెఈఓ గౌతమి, డిప్యూటీ ఈఓ లోకనాథం, భాస్కర్, విజిలెన్స్‌సిబ్బంది పాల్గొన్నారు .


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






# ఆశలు ఆవిరి

## గిట్టుబాటు ధర లేక మామిడి రైతు విలవిల
## ర్యాంపుల్లో కేజీ రూ.22కు పడిపోయిన తోతాపురి



చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:
ఈ మామిడి సీజన్‌లో తక్కువ విస్తీర్ణంలో కాపు కాసిన మామిడి పంటపై రైతు పెట్టుకొన్న ఆశలు ఆవిరి అయ్యాయి. మామిడి గిట్టుబాటు ధర బాగుంటుందని ఆశించిన రైతుకు వున్న మామిడి ధర పతనం కావడంతో నోరు బాదుకుంటున్నాడు. ఐదేళ్ళ క్రితం వరకు మామిడికి గిట్టుబాటు ధర లభిస్తుండటంతో జిల్లా రైతాంగం మామిడి పంట సాగుపై మక్కువ చూపింది. అయితే ప్రతి రైతు మామిడి పంట సాగు చేయడం, సీజన్‌లో మామిడి ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి రైతుకు మద్దతు ధర కల్పించకపోవడంతో క్రమేపి మామిడి ధర పతనం ప్రారంభమైంది. ఒకొక్క ఏడాది మామిడికి మద్దతు ధర లేకపోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకొని మామిడి సాగు చేసిన రైతుకు ప్రోత్సాహకం కింద టన్నుపై కొంత మొత్తం ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఈ ఏడాది జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో మామిడి పంట సాగు కావడంతో మామిడి రైతు ఈ సీజన్‌లో కాయలకు డిమాండ్ విపరీతంగా వుంటుందని భావించి ఆశల్లో విహరించారు. జిల్లా వ్యాప్తంగా 58 వేల హెక్టార్ల విస్తీర్ణంలో రైతాంగం మామిడి పంట సాగు చేస్తోంది. ఇందులో ఈ ఏడాది కేవలం 15 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే మామిడి పంట సాగు అయ్యింది. జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో మామిడి పంట సాగు కావడంతో ఈ ఏడాది మామిడి పంటకు గిట్టుబాటు ధర విపరీతంగా వుంటుందని రైతు ఆశల్లో విహరించాడు. జిల్లాలో ప్రస్తుతం సాగు అయిన 15 వేల హెక్టార్ల మామిడి పంటలో అత్యధికంగా 11 వేల హెక్టార్ల మేరకు రైతులు తోతాపురి రకం మామిడి పంట సాగు చేస్తారు. తోతాపురి రకం మామిడి ప్రాసెసింగ్ యూనిట్లలో భారీ ఎత్తున వినియోగిస్తుండటం, ఈ సీజన్‌లో తోతాపురి రకం మామిడి దిగుబడి తక్కువగా వుండటంతో గిట్టుబాటు ధరపై రైతు ఆశలు పెట్టుకొన్నాడు. ప్రాసెసింగ్ యూనిట్ల ఫ్యాక్టరీలతో పాటు మార్కెట్ యార్డులు, బయట ర్యాంపుల్లో వ్యాపారం నిర్వహించే వ్యాపారులు సీజన్ ప్రారంభంతో తోతాపురి రకం మామిడి కేజీకి రూ.30 చెల్లించారు. ఈ సీజన్‌లో తోతాపురి దిగుబడి తక్కువగా వుండటం, ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలకు తోతాపురి రకం ముడి సరుకు ఎక్కువ అవసరం వుండటంతో ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే అనూహ్యంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి ఇక్కడికి తోతాపురి రకం మామిడి దిగుమతి కావడంతో ఇక్కడి రైతులకు ఫ్యాక్టరీలు మొదటి చెల్లించిన ధరను తగ్గించడం ప్రారంభించాయి. సీజన్ ప్రారంభంలో ఒక టన్ను తోతాపురి రకం మామిడి 30 వేల రూపాయలు చెల్లించిన ఫ్యాక్టరీ యాజమానులు గత వారం రోజులుగా ఒక టన్ను తోతాపురి మామిడిపై కేవలం 23 వేల రూపాయలు మాత్రమే చెల్లించడం ప్రారంభించాయి. ఒక టన్నుపై ఒకేసారి 7 వేల రూపాయల వరకు తగ్గిపోవడంతో మామిడి రైతు నోరు బాదుకుంటున్నాడు. ఈ మేరకు ఫ్యాక్టరీలకు రైతులు ఒకేసారి ఎక్కువ మొత్తంలో తోతాపురి రకం మామిడి తీసుకెళ్ళడంతో అక్కడ మామిడి అన్‌లోడ్ కావడం సైతం కష్టంగా మారింది. ఈ క్రమంలో బయట ర్యాంపుల్లో వ్యాపారం నిర్వహించే వ్యాపారులకు రైతులు తోతాపురి మామిడి సరఫరా ప్రారంభించారు. అయితే ర్యాంపు యాజమానులు వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకొని రైతుకు ఒక టన్ను తోతాపురి రకం మామిడిపై 22 వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తుండటంతో రైతుకు మరింత నష్టం జరుగుతుంది. జిల్లాలో చిత్తూరు, బంగారుపాళ్యం, పుత్తూరు, పెనుమూరుల్లో మార్కెట్ యార్డులు వున్నప్పటికీ ఇక్కడ తాజా తోతాపురి కాయలు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో యార్డుల్లో తోతాపురి మామిడి వ్యాపారం పెద్దగా జరుగని పరిస్థితి నెలకొంది. అలాగే జిల్లాలో దామల్‌చెరువు(మ్యాంగోనగర్)లో ప్రైవేటు యార్డు వున్నప్పటికీ అక్కడ సైతం కలర్ మామిడి కాయలు మాత్రమే అధిక మొత్తంలో వ్యాపారం జరుగుతుండటంతో తోతాపురి రకం మామిడి అక్కడికి వెళ్ళడం లేదు. ఇక రైతుకు మిగిలింది మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపుల వద్ద అమ్మకాలు మాత్రమే చేయాల్సి వుండటంతో తోతాపురి మామిడి సాగు చేసిన రైతుకు తీరని నష్టం జరుగుతుంది. తోతాపురి మామిడి రైతుకు జరుగుతున్న నష్టంపై స్పందించిన కలెక్టర్ సగిలి షన్మోహన్ మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపు యాజమానులు ఒక టన్ను తోతాపురి రకం మామిడిపై రైతుకు ఒక టన్నుపై 30 వేల రూపాయలు తగ్గకుండా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఈ ఉత్తర్వులు ఏ మేరకు మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపు యాజమానులు అమలు చేస్తారనే విషయంపై ఎవరికి స్పష్టత లేదు. ఈ క్రమంలో జిల్లాలో తోతాపురి మామిడి సీజన్ మరో 20 రోజుల్లో ముగియనుండటంతో తోతాపురి మామిడి రైతుకు మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, ర్యాంపు యాజమానులు ప్రస్తుతం మామిడి రైతుకు టన్నుపై చెల్లిస్తున్న రూ.23, రూ.22 వేలు చెల్లిస్తాయా! లేక కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక టన్ను తోతాపురి మామిడిపై రూ.30 వేలకు తగ్గకుండా చెల్లించడానికి చర్యలు తీసుకుంటారా! అనేది చూడాల్సి వుంది.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్



శ్రీకాళహస్తిలో బక్రీద్ సందర్భంగా నమాజులు ఆచరిస్తున్న ముస్లింసోదరులు

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గురువారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో బక్రీద్ సందర్భంగా ఈదుల్‌అజ్‌హా ప్రార్థనలను ఆచరించారు. అయితే అందరి సౌకర్యార్థం, ఖుర్బానీ ఇచ్చే వారికి సదుపాయంగా మూడు చోట్ల ప్రార్థనలను ఏర్పాటు చేసారు. రాజీవ్‌నగర్‌లో ప్రార్థనలను ఉదయం 7గంటలకు జరిపారు. ఇక్కడ నమాజును హాఫీజే ఖుర్ ఆన్ ఉస్మాన్ సాహెబ్ చదివించగా ఈదులగుంటలో ముఫ్తి నాయిం సాహెబ్ ఆచరింప జేసారు. అయ్యలనాడు చెరువులో హాఫీజే ఖుర్ ఆన్ జసీముద్దీన్ చదివించారు. బక్రీద్ పండగ సందర్భంగా శాసనసభ్యుడు వెంకటసుధీర్‌రెడ్డితో పాటు తెలుగుదేశం నాయకులు హాజరై ఈద్‌ముబారక్ తెలిపారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగల్ని హిందూ ముస్లింలు కలసి జరుపుకోవటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో సోమవారం ముస్లింల బక్రీద్ పండగ సందర్భంగా పలువురు స్నేహితులు ఈద్‌గాహ్‌ల వద్ద హాజరై శుభా కాంక్షలు తెలుపుకున్నారు.

### ప్రవక్తల త్యాగాలను మరువరాదు

ఇస్లాం మత వ్యాప్తి కోసం, ఈమాన్ కోసం మన ప్రవక్తల త్యాగాలను విస్మరించ రాదని ముఫ్తీనయిం సాహెబ్ వివరించారు. నాడు విగ్రహారాదనను తుదముట్టించుటకు ఇబ్రహీం ఖలీలుల్లా తీసుకున్న నిర్ణయం. అందుకు ఆతను అనుభవించిన శిక్షలను అల్లాహ్‌ను నమ్ముకొని విజయం సాధించిన తీరును వివరించారు. ఇక ఖుర్బానీని మూడు రోజుల వరకు ఇవ్వవచ్చునని తెలిపారు. గురువారం సాయంత్రం వరకు ఖుర్బానీని ఇవ్వవచ్చునని ముఫ్తీసాహెబ్ వివరించారు. కాగా రాజీవ్‌నగర్‌లో హాఫీజే ఖుర్ ఆన్ ఉస్మాన్, అయ్యలనాడు చెరువు ఈద్‌గాహ్‌లో జసిముద్దీన్‌లు ఈదుల్ అజ హా నమాజులను చదివించారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షించగా మున్సి పాలిటి శానిటేషన్‌ను పర్యవేక్షించారు. రెండు చోట్లా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెం కటసుధీర్‌రెడ్డి హాజరై తన సందేశాన్ని అందిస్తూ మైనారిటి ముస్లిం సామాజికావ సరాలను గుర్తుపెట్టుకొని పరిష్కరిస్తామన్నారు. మాటల్లో కాదని 6 నెలల లోపల మార్పుతో పాటు అభివృద్దిని శ్రీకాళహస్తిప్రజలు చూస్తారన్నారు. రంజాన్‌తోఫా, దుల్హన్ పథకాలతో పాటు వచ్చే ఏడాది నుంచి తాను స్వయంగా ప్రతి ముస్లిం ఇంటికి ఏదో ఒక సహాయం అందించాలన్న లక్ష్యంతో ఉన్నానన్నారు.

## చిత్తూరులో ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పరిధిలో సోమవారం బక్రీద్ ప్రార్థనలను ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించు కున్నారు. చిత్తూరు గిరింపేట ఈద్గా మైదానంలో నగర పరిధిలోని మసీదుల్లోని ముస్లీంలందరు బక్రీద్ ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లీంలో ఈద్గాలో బక్రీద్ పురస్కరించుకుని ప్రత్యే కంగా ఈద్-ఉల్-అజా సాముహిక నమాజు నిర్వ హించారు. గిరింపేట ఈద్గాలో జరిగిన ముస్లీంల ప్రత్యేక ప్రార్థనలకు స్థానిక ఎమ్మెల్యే గురజాల జగ న్మోహన్‌నాయుడు హాజరయ్యారు. ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లీంలతో పాటు అన్ని వర్గాల సహకారంతో తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం జరిగిందని, ముస్లీంలకు ఏ అవసరం వచ్చినా తన కార్యాల యంను సంప్రదించి సమస్యను చెప్తే దానిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. నమాజు అనంతరం ముస్లీం సోదరులు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## రుయాలో మంత్రి సత్యకుమార్ తనిఖీలు



రోగి సహాయకులను విచారిస్తున్న మంత్రి సత్యకుమార్

తిరుపతి హెల్త్, జూన్ 17, ప్రభాతవార్త
రుయా ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొట్ట మొదటి సారిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని అనుగ్రహం కోసం తిరుమలకు కుటుంబ సమేతంగా విచ్చేశారు. అనంతరం అత్యవసర విభా గ వార్డును ఆకస్మిక తనిఖీల్లో భాగంగా వైద్య చికిత్స కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులను అక్కడ అందుతున్న వైద్యం గురించి, వైద్యులు వైద్యం అందిస్తున్న తీరును, నర్సింగ్ సిబ్బంది నాలుగో తరగతి సిబ్బంది వలన ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా, మెరుగైన వైద్యం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓపి విభాగమునకు వెళ్లి ఓపి చీటీలు పొందే దగ్గర ఏవైనా సాంకేతిక ఇబ్బందులు కలుగుతున్నాయా అక్కడ క్యూలైన్‌లో వున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వైద్యం కోసం అక్కడికి వచ్చిన రోగులు రుయా ఆసుపత్రి నందు మెరుగైన వైద్యం అందుతున్నదని, వారికి కావాల్సిన మం దులు కూడా విరివిగా, అందుబాటులో ఉన్నాయని రోగులు, ప్రజలు మంత్రికి సంతోషపూర్వకంగా తెలిపారు. ఈ ఎన్‌డిఏ ప్రభుత్వంలో ఇప్పుడు మాకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలకు చెందిన మందులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనరల్ మెడిసిన్ విభాగమునకు వెళ్లి ఇన్‌పేషంట్ రోగి వారి సహాయకులను ఇక్కడ అందుతున్న వైద్యం గురించి, కొద్దిసేపు వార్డు లోపలికి వెళ్లి వైద్య సిబ్బం ది అందిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బిజెపి నాయకులు, భాను ప్రకాష్ రెడ్డి, చిట్టిబాబు యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, అజయ్ కుమార్, జనసేన నాయకులు, రుయా ఆసుపత్రి నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, నాలుగవ తరగతి సిబ్బం ది, ఎస్‌వి వైద్య కళాశాల పిఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

## ధ్వజారోహణంతో ప్రారంభమైన
# అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలు





అప్పలాయగుంటలో వైభవంగా ధ్వజారోహణం, పెద్ద శేష వాహనంపై ప్రసన్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 17 ప్రభాతవార్త:
అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 6.55 నుంచి 7.25గంటల మధ్య మిథున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఈ కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున 3.30 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి జరిపించారు. ఉదయం 6 నుంచి మాడవీధుల్లో ధ్వజపతం, తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా తన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షిస్తారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గురుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి ధ్వజస్తంభం ప్రతిష్టించారు. ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు ఉభయ దేవేరులతో పాటు స్వామివారికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 6 గంటలకు స్వామివారు సర్వాలంకార భూషితుడై పెద్ద శేషవాహనంపై మాడవీధుల్లో విహరించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఏడుకొండలవాడా..ఏది నిజం!

## శ్రీవాణి ట్రస్ట్ నిధులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు !

తిరుపతి, జూన్ 6(ప్రభాతవార్తప్రతినిధి:
దేశవ్యాప్తంగా హిందూ సనాతన ధర్మాన్ని మరింతగా వ్యాప్తి చేసేం దుకు తిరుమల తిరుపతి దేవస్థానమ్ శ్రీవాణి ట్రస్ట్‌ను నిర్వహి స్తోంది. ఈ ట్రస్ట్‌ద్వారా దాతలు విరాళాల రూపంలో వస్తున్న నగదుతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారప్రాంతాలు, వెనుకబడిన కాలనీల్లో ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల మరమ్మతులు, ఆలయాల్లో ధూపదీపనైవేద్యాలకు ఈ నిధులు ఖర్చుచేయాలని ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటివరకు దాదాపు 1,500కోట్ల రూపాయలకు పైగా ఆదాయం చేకూరింది. ఈ నిధులను పక్కదారిపట్టించి ప్రభుత్వానికి మళ్ళించారనే దుమారం గత ఏడాది బలంగా వ్యాపించింది. రాజకీయనేతలు ఈ ట్రస్ట్ నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఏకంగా నిధులను టిటిడి ఉన్నతాధికారులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు గుప్పించారు. అయితే శ్రీవాణి ట్రస్ట్ నిర్వహణ, నిధుల వ్యయంపై ఈ ఏడాది జనవరిలో టిటిడి ధర్మకర్తలమండలి శ్వేతపత్రం విడుదల చేసిన విషయం విదితమే. 2018 ఆగస్టులో శ్రీవాణి ట్రస్ట్‌ను ప్రారంభించాలని టిటిడి ధర్మకర్తలమండలి శ్రీకారం చుట్టినా 2019 మేనెలలో ప్రభుత్వం మారడం, వైసిపి కొత్తప్రభుత్వం ఏర్పాటుకావడం జరిగింది. వెనువెంటనే కేంద్రసర్వీసుల్లోని ఐడిఇఎస్‌లో ఉన్న ఏవి ధర్మారెడ్డిని టిటిడి ఈఓగా నియమిస్తూ గత ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. దీంతో 2019 అక్టోబర్‌లో పూర్తిస్థాయిలో శ్రీవాణి ట్రస్ట్ భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ట్రస్ట్‌క్రింద 10వేల రూపాయలు విరాళంగా, 500 రూపాయలు విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్ క్రింద నగదు వసూలుచేస్తున్నారు. ఇందులో విరాళాలకు సంబంధించి ప్రత్యేక రశీదు, బ్రేక్ దర్శన టిక్కెట్‌కు ప్రత్యేక రశీదు జారీచేస్తున్నారు. విరాళాల రూపంలో వస్తున్న నగదుకు జవాబుదారీతనం లేదని తొలినుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు టిటిడి ధర్మకర్తలమండలి, టిటిడి అధికారులు ఖండిస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో 2019 అక్టోబర్‌లో ప్రారంభమైన శ్రీవాణి ట్రస్ట్‌కు తొలి ఏడాదిలో 26.25 కోట్లు రూపాయలు ఆదాయం చేకూరింది. 2020వ సంవత్సరానికి 70.21కోట్లు, 2021లో 176కోట్లు, 2022లో 282.64కోట్లు, 2023లో వెయ్యికోట్ల రూపాయలు విరాళాలందాయి. 2024లో గత ఐదునెలల్లో మరో 500కోట్ల రూపాయల వరకు ఆదాయం చేకూరినట్లు తెలుస్తోంది. ఈ నిధులతో తెలుగురాష్ట్రాల్లోనేగాక దేశ వ్యాప్తంగా సమరస సేవా ఫౌండేషన్ సహకారంతో 2,273నూతన ఆలయాలు నిర్మాణానికి నిధులు కేటాయించారు. 176పురాతన ఆలయాలు పునరుద్దరణ చేపట్టారు. 150 ఆలయాలకు నెలకు 5వేల రూపాయలు లెక్కన దూపదీపనైవేద్యాలకు నిధులు కేటాయిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ వరకు కూడా శ్రీవాణిట్రస్ట్ నిధులు పక్కదారిపట్టాయని, ఏకంగా టిటిడి నుండి ప్రభుత్వానికి మళ్ళిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. శ్రీవాణి ట్రస్ట్ నిదుల విషయంపై గత గురువారం తిరుపతిలో జనసేనపార్టీ నాయకులు సిఐడి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

## చిత్తూరులో అన్న క్యాంటీన్ ప్రారంభం

ఎమ్మెల్యే జగన్మోహన్‌నాయుడు





## పక్కాగా నిత్యావసర వస్తువుల ప్యాకింగ్ తూనికలు

- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

4 లో

## విద్యుత్‌షాక్‌కు గురై పాడిఆవు మృతి



**పెద్దపంజాణి జూన్17 ప్రభాతవార్త :** మండలంలోని రాయలపేటలో రోడ్డుప్రక్కన ఉన్న ఓ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ తీగలుతగిలి పాడిఆవు మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన మణియొక్క పాడిఆవు సోమవారం ఉదయం గ్రామంలో ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేతకువెళ్ళగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో పాడిఆవు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు 70 వేల రూపాయల దాకా విలువచేసే పాడిఆవుమృతి చెంది నష్టంజరిగినట్లు బాధితుడు మణి తెలిపారు.

## ఘనంగా బక్రీద్ పర్వదినం



కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త

కుప్పంలో ముస్లిం సోదరులు త్యాగనిరతికి ప్రతీక అయిన బక్రీద్ పండగను సోమవారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఉదయం 6.30 గంటలనుంచే కుప్పం పట్టణంలో ఈద్ నమాజులు మొదలయ్యాయి. ఈసందర్భంగా మత గురువులు ఈద్ నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అల్లాహ్ పట్ల కృతజ్ఞతకు బక్రీద్ పండగ నిదర్శన ంగా నిలుస్తుందన్నారు. ఇబ్రహీం యొక్క భక్తి భావాన్ని గుర్తు చేసుకుంటూ బక్రీద్ పండగను జరుపుకుంటామన్నారు. దివ్యగ్ర ంథం ఖురాన్‌లో సూచించిన మేర ముస్లిం సోదరులు జీవన విధానాలు అలవర్చుకోవాలన్నారు. రోజుకు ఐదుపూటల నమాజులు చదవడం, దివ్యగ్రంథం ఖురాన్ పఠించడం, పేదలకు సాయం చేయడం, సన్మార్గంలో పయనించడం చేయాలని సూచించారు. కుప్పం పట్టణంలోని మస్‌జిద్ ఎ నబావి, లక్ష్మీపురం, కొత్తపేట, మోడల్ కాలనీ ఈద్గాలతో పాటు గ్రామీణ ప్రాంతాలైన కంగుంది, నూలుకుంట, మల్లానూరు, జంపనూరు, రాగిమానుమిట్ట, మహ్మద్‌పురం, గణేష్‌పురం తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పండగ సందర్భంగా ఈద్ నమాజ్‌లను ఆచరించారు. కుప్పం పట్టణంలో సిఎం చంద్రబాబునాయుడు తరపున తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, అప్పు, బాబు, కౌన్సిలర్ సోమశేఖర్, మైనార్టీ నేతలు జాకీర్, సర్దార్, అన్సర్, ఫైరోజ్, గనిఉల్లా, నబీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం :** మండలంలో ఉన్న ముస్లిం సోదరులు బక్రీద్ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. రాళ్లబూదుగూరు, నంజంపేట, ఎంకెపురం, సోగడబళ్ల, కోనేరుకుప్పం తదితర గ్రామాల్లో ఉన్న ఈద్గాలు, మసీదుల్లో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈసందర్భంగా ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకుని ఆలింగనం చేసుకున్నారు.

**రామకుప్పం :** మండలంలో బక్రీద్ పండగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. విజలాపురంలోని జామియా మసీదు, ఇందిరా నగర్‌లోని మదీనా మసీదు, మక్కా మసీదు, గెర్నిపల్లి, గొరివిమాకులపల్లి, బళ్ల, కెంచనబళ్ల తదితర గ్రామాల్లో ఉన్న ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత పెద్దలు దివ్యగ్రంథం ఖురాన్ బోధనలు వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు

## కెఇసి వైస్ చైర్మన్ డా॥ సునీల్‌రాజ్‌చే విద్యార్థులకు నగదు బహుమతులు



**కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలోని సుమారు ముప్పై ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ చైర్మన్ డా॥ సునీల్ రాజ్, బిసిఎస్ గ్రూప్స్ చైర్మన్ బిసి నాగరాజ్‌లు నగదు బహుమతులు అందించి సత్కరించారు. సోమవారం కెఇసి వైస్ చైర్మన్ డా॥ సునీల్‌రాజ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో ఉన్న చిరువ్యాపారులకు తమవంతుసాయంగా డా॥ సునీల్ రాజ్ గొడుగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన ్మదినాన్ని పేదలు, విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉంద న్నారు. అంతకుముందు కాలేజ్ అధ్యాపకులు, సిబ్బంది ఆయనను ఘన ంగా సత్కరించారు. సిఇఒ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ డా॥ అంబా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుతోనే బిసిల అభ్యున్నతి

**కుప్పంరూరల్, జూన్ 17 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడుతోనే బిసిల అభ్యున్నతి సాధ్యమని యాదవ సంఘం కన్వీనర్ మణి గోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ కులానికి చెందిన పల్లా శ్రీనివాస్‌ను తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తొలినుంచి బిసిలకు రాజకీయ పరంగా ప్రాధాన్యత కల్పిస్తోంది తెలుగుదేశం పార్టీయేనన్నారు. బిసిలు బ్యాక్‌బోన్ అని సిఎం చంద్రబాబు విశ్వసిస్తారన్నారు. మాజీ సిఎం జగన్ బిసిల ద్రోహి అన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, యాదవ సంఘం నేతలు రాజారాం, భార్గవ్, మోహన్, బిసి రాష్ట్ర నేతలు శాంతారాం, కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, నేతలు ఈశ్వర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



పుంగనూరు, జూన్ 17 ప్రభాతవార్త :

మండలంలోని షికారీ ప్రజలు నివసించే ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో గంటల వ్యవధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి ట్రాన్స్‌కో అధికారులు సెహబాష్ అనిపించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మదనపల్లి మార్గంలో ఈడిగపల్లికు ఐదుకిలోమీటర్ల లోపల కొండకోనల్లో షికారిపాలెం ఉంది. ఈషికారీ పాలెంలో వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా ట్రాన్స్‌ఫారం ధ్వంసమైపోయింది. అడవి మధ్యన నివసిస్తున్న ఈకుటుంబాలకు రాత్రికి విద్యుత్ సదుపాయం అందించాలనే ఉద్దేశ్యంతో వార్త ప్రతినిధి ఈవిషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు తెలియ చేయడంతో స్పందించిన ఏడిఇ మూర్తి, రూరల్‌ఏఇ ధనుంజయులు హుటాహుటిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసారు. తక్షణం స్పందించిన విద్యుత్‌శాఖాధికారులకు షికారీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

**బంగారుపాళ్యం, జూన్ 17 ప్రభాతవార్త:**



మండలంలోని ముస్లీం సోదరులు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మొగిలి వెంకటగిరి సమపంలోని ఈద్గా వద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే బంగారుపాళ్యంలోని జామియా మసీదు, జెండామాను వీధి, తగ్గువారిపల్లి, మొగిలి వెంకట గిరి తదితర ప్రాంతాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా వద్ద ముస్లీం మత పెద్ద మాట్లాడుతూ ప్రతి ఒక్క ముస్లీం ప్రేమ కలిగి వుండిఅందరితో కలిసి వుండాలని సూచించారు. పలువురు ముస్లీంలు మాంసంను దానంగా అందజేశారు.

## యాదమరిలో బక్రీద్ వేడుకలు

యాదమరి, జూన్ 17 ప్రభాతవార్త:

యాదమరి మండలంలో ముస్లీంలు సోమవారం బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని యాదమరి, పెరియంబాడి, బుడితిరెడ్డిపల్లి, 14 కండ్రిగ ముస్లీంవాడ ప్రాంతాల్లోని ముస్లీంలు ఈద్గాలకు వెళ్ళి బక్రీద్ ప్రత్యేక నమాజు చేశారు. యాదమరి మసీదు, వరదరాజులపల్లి పరిధిలో వున్న ముస్లీంలో వరదరాజులపల్లి గ్రామ సమీపంలోని ఈద్గాలో బద్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా హజరత్ ముస్లీం సోదరులకు ఈద్-ఉల్-అజా నమాజును ప్రత్యేకంగా చేయించారు. నమాజు అనంతరం ముస్లీం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మధ్యాహ్నంనుండిముస్లీంలు ఖుర్బానీ పేరిట మాంసం పంపిణీ కార్యక్రమంను చేపట్టారు.

## గంగజాతర ప్రారంభం

**పాలసముద్రం, జూన్ 17 ప్రభాతవార్త:**



పాలసముద్రం గ్రామంలో సోమవారం గంగజాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గంగజా తరలో భాగంగా సోమవారం ముత్యాలమ్మ ఊరేగిం పును వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము గంగమ్మను ప్రతిష్టించి బుధవారం నిమజ్జనం చేయనున్నారు.

## ఘనంగా ద్రౌపది కళ్యాణం

పాలసముద్రం, జూన్ 17 ప్రభాతవార్త:

మండలంలోని కృష్ణజిమ్మాపురం పంచాయతీ పరిధిలోని కొండం గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపది కళ్యాణంను ఘనంగా నిర్వహించారు. మొదట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆపై ద్రౌపది కళ్యాణంను వైభవంగా నిర్వహించి పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య

పెద్దపంజాణి, జూన్17 ప్రభాతవార్త :

మండలంలోని కెళవాతి గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులు కుమారుడు కె.యుగంధర్(29) అనేయువకుడు ఆదివారం రాత్రి తనింట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనమేరకు.. యుగంధర్‌కు ఇటీవలే వివాహమైంది. కొంతకాలంగా ఇతను మద్యానికి సైతం అలవాటుపడ్డారన్నారు. ఇటీవల ఓ భూతగాదా విషయంలో సైతం ఇతను పాల్గొన్నాడని ఈ నేపథ్యంలో ఇంట్లోవారు మందలించారు. క్షణికావేశానికిలోనైన యుగంధర్ కుటుంబీకులందరూ ఆరుబైట కూర్చొనిఉండగా ఇంట్లో ఉరివేసుకుని మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గంగమ్మ సేవలో ప్రముఖులు

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 17 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు. వారిని అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మండపంలో వేదాశీర్వాదం దుశ్వాలవాలతో సత్కరించి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. మండల తేదేపా యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు, సీనియర్ నాయకులు పతిరాజు, రెడ్డిప్రసాద్(భోజీ), హరిరాయల్, పవన్, తదితరులు అమ్మవారిని దర్శించుకొన్న వారిలో వున్నారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్

చౌడేపల్లి, ఆగస్టు 12 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని రెండు మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా చెదుగుట్లపల్లి ఈద్గా వద్దకు చేరుకొన్నారు. అక్కడ మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అదే విధంగా దాదేపల్లి, ఖాన్‌సాబ్‌మిట్ట, బుటకపల్లి, లద్దిగం, కోటూరు, ఎ.కొత్తకోట, అంకుతోటపల్లి, మర్రిమాకులపల్లి తదితర గ్రామాల సమీపంలోని ఈద్గా, మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు.

## కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు

చౌడేపల్లి, జూన్ 17 ప్రభాతవార్త



చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రి సమీపంలో గల విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులచే అభిషేక ప్రియుడు పరమశివుడికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. అదే విధంగా విశాలాక్షి, వినాయక, సుబ్రమణ్యం స్వామిలకు ప్రత్యేక పూజలు చేసారు. చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ నిర్మాణ కర్త మనోహర్ ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

## చంద్రబాబు పాలన మరో చరిత్ర సృష్టిస్తుంది

-విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు

పుంగనూరు, జూన్ 17 ప్రభాతవార్త :



ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రముఖ్యమంత్రి చం ద్రబాబునాయు మరో చరిత్ర సృష్టించేలా పాలన సాగిస్తారని విశ్రాంత డిఎస్పీ, రాష్ట్రవాల్మీకి సంఘ అధ్యక్షుడు కనుమకుంట సుకుమార్‌బాబు అన్నారు. సోమవారం గోపిశెట్టిపల్లిలో జరిగిన తెలుగుదేశం విజయోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళు రాష్ట్రంలో అరాచకపాలన, దారుణ అవినీతి, ఎక్కడా లేనంతటి దౌర్జన్యకాండలు ప్రజలు అనుభవించారని, వారందరికీ బుద్దిచెపుతూ ముఖ్యమంత్రి అన్నింటిపై దర్యాప్తులు నిర ్వహించాలని డిమాండ్‌చేశారు. తెలుగుదేశం నాయకులు మాధవరెడ్డి మాట్లాడుతూ ఎంతో సుభిక్షంగా పరిపాలించిన జమీందారులే, బతకమని చెప్పి ప్రజలకు వేలాది ఎకరాలు ఉచితంగా ఇచ్చారన్నారు. ఇపుడు పుంగనూరులో వేలాది ఎకరాలు దోచుకునేందుకు స్కెచ్‌లు వేసిన వారి ఎత్తులు ఇక సాగబోవన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, నాగరాజరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం ధ్వంసం

**పుంగనూరు, జూన్ 17 ప్రభాతవార్త :**

వివిధ కేసులలో పట్టుబడిన అక్రమ మద్యంను పుంగనూరు పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ఎక్సైజ్, సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు, పుంగనూరు పోలీస్ సిఐ రాఘవరెడ్డిల ఆదేశాల మేరకు 39కేసులలో పట్టుబడిన మద్యం టెట్రాపాకెట్లు, బాటిళ్ళను పొలిమేర చెరువు గట్టున రోడ్డురోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మున్సిపాలిటీ వాటర్ సప్లై కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త



గూడూరు మున్సిపాలిటీలో రెండు పూటలా మంచినీళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని సచివాలయ సిబ్బంది ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హెచ్చరించారు. గూడూరు పట్టణ సమీపంలోని విందూరులో ఉన్న మున్సిపాలిటీ వాటర్ సప్లై కేంద్రాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పరిశీలించారు. నీటి సరఫరా పై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావుతో చర్చించారు. అనంతరం గాంధీనగర్ సమీపంలో ఉన్న టిడ్కో అపార్టెంట్ నివాసాల వద్ద శానిటేషన్ నీటి సరఫరాను పరిశీలించారు. స్థానికులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రధాన వాటర్ సప్లై కేంద్రాన్ని పరిశీలించామని కొంత స్థలం ఆక్రమణలకు గురైందని వెంటనే వాటిని తొలగిస్తామని తెలిపారు. అలాగే గత ప్రభుత్వంలో నీటి సరఫరాను అస్తవ్యస్తం చేశారని అన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా పునరుద్దరిస్తామని అలాగే ంరెండు పూటలా మంచినీళ్ళు వచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో మంజూరు చేసిన టీడ్కో అపార్ట్మెంట్ నివాసాలకు వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రంగులు మార్చడం అమానుషమని వెంటనే లబ్ధిదారులు కోరిన రంగులు వేయాలని అధికారులను ఆదేశించామని వెల్లిడించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, శివకుమార్, మస్తాన్ నాయుడు, పిట్టి నాగరాజు, రహీం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్

కోట, జూన్ 17 ప్రభాతవార్త

కోట మండలంలో సోమవారం బక్రీద్ పండగను ముస్లీంలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ ఘనంగా నిర్వహించారు. ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదులో సామూహిక ప్రార్థనలో నిర్వహించారు. బక్రీద్ నేపథ్యం గురించి మత పెద్దలు వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్నేహితులు బంధువులకు విందు ఇచ్చారు. విద్యానగర్, కోట, గోవిందపల్లి, కొత్తపాళెం ,చిట్టేడు, తదితర గ్రామాల్లో బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మత పెద్దలు, ముస్లీం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కామేశ్వర ప్రసాద్

వెంకటగిరి టౌన్, జూన్ 17, ప్రభాతవార్త



బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహి స్తామని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కామేశ్వర ప్రసాద్ తెలిపారు. వెంకటగిరి శంకరమంటంలో నియోజ కవర్గం స్థాయి బ్రాహ్మణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ సేవ సంఘమును పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణులు అందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కొత్త ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ నుండి వచ్చే సంక్షేమ పథకాలను అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యవర్గంలో ప్రభాకర్ జి. వెంకటేశ్వర్లు, సీతారామశస్త్రి, మణికంఠ శర్మలను, ఎన్నుకున్నారు. సమావేశంలో రామకృష్ణ, బాబీ శర్మ, శ్రీనివాసులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కురుగొండ్లను అభినందించిన ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు



వెంకటగిరి టౌన్, జూన్ 17, ప్రభాతవార్త

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య కలిసి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజాసంఘాల ఐక్య వేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామకృష్ణను కలిసిన వెంగమాంబాపురం నాయకులు

బాలాయపల్లి, జూన్ 17, ప్రభాతవార్త



వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను వెంగమాంబాపురం నాయకులు, ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వర్లు నాయుడు, ఉప్పలపాటి మోహన్ నాయుడు, కందిమల్ల శ్రీహరినాయుడు, నరెడ్ల రమేష్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఘనంగా సన్మానించారు.

## గూడూరులో ఘనంగా బక్రీద్ వేడుకలు

గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త



బక్రీద్ సందర్భంగా గూడూరు పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను తెలియజేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దలు సమాధుల వద్దకు వెళ్లి వారిని స్మరించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైభవంగా వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రాజా వీధిలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గూడూరు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభానికి అభిషేకం పూజలు నిర్వహించి గరుడ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. భక్తులకు కోడి ముద్ద ప్రసాదాన్ని అందించారు.

## బడి బాటలో బంగారు లోకం

కోట, జూన్ 17 ప్రభాతవార్త

భగవంతుడు కనుక ప్రత్యక్షమైతే.. నా బాల్యాన్ని తిరిగి ఇవ్వమంటాను.. ఇదీ విశ్వ కవి రవీంద్రుడీ మాట.. బాల్యం ప్రతి వ్యక్తి జీవితంలో మరపురాని జ్ఞాపకం బంగారు లోకంలో విహరించాల్సిన వయస్సు అలాంటి అందమైన బాల్యం నేడు పలువురికి దూరమవుతోంది. ఓనమాలు దిద్దాల్సిన చిట్టి చేతులు.. పనులతో కందిపోతున్నాయి. బతుకు బాటలో శ్రామికులు, బాల కార్మికులుగా మారుతున్నారు. ఇలా బడి ఈడు పిల్లలు ఎంత మంది బయట ఉన్నారో పరిశీలించడానికి వారిని తిరగి పాఠశాలల్లో చేర్పించడానికి జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని చేపట్టిందని మండల విద్యాశాఖధికారి మస్తానయ్య చెప్పారు. ఆయన సోమవారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ గత నాలుగేళ్లగా 14 ఏళ్ల లోపు బాలలను నమోదు చేసేవారని కానీ నేడు 18 ఏళ్ల లోపు వారి వరకూ కూడా బడి ఈడు పిల్లలుగానే గుర్తించడం జరుగుతుందన్నారు. మండల స్ధాయిలో ర్యాలీలు, రెండు రోజు గ్రామ సభ ద్వారా బడి ఉత్సవం, మూడు రోజు బాలికోత్సవాన్ని జరిపి బడి బయట ఎవరూ ఉండకూడదని బాలికలతో ప్రతిజ్ఞ చేయించడం, నాలుగో రోజు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందరికి వివరించడం, చివరి రోజున గుర్తించిన పిల్లలను యూడౌస్‌లో నమోదు చేయడంతో కార్యక్రమం ముగిస్తుంని ఎంఇఒ మస్తానయ్య వివరించారు.

## విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు

గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల బస్సు ఆటోను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వాహన పూజా చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణ చుట్టుపక్కల ఉన్న గ్రామాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కొరకు బస్సు, ఆటో ఏర్పాటు చేయడమైందని పేర్కొన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం అయినవి అన్నారు. పాఠశాలలో ప్రత్యేకతలు ఇంగ్లీష్ మీడియంతో పాటు యోగ, కంప్యూటర్, వేదిక్ మ్యాథమెటిక్స్, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైతిక ఆధ్యాత్మిక విలువలు, ఎన్ఈపి 2020 పాఠ్య ప్రణాళిక బోధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగులేటి వెంకటసుబ్బారావు, సోమిశెట్టి లక్ష్మీ నరసింహస్వామి, సమితి అధ్యక్షులు వంగా ప్రసాద్ రెడ్డి, సహ కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్, కోశాధికారి వాకాటి రామ మోహన్, కమిటీ సభ్యులు, వెంకట రమణయ్య, సనత్ కుమార్ రెడ్డి, ప్రవీణ్ కృష్ణ, విశ్వేశ్వరావు, ప్రధానాచార్యులు రంగనారాయణ మాతాజీలు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు పాలన స్వర్ణయుగమే

బిసి సెల్ ప్రధాన కార్యదర్శి, తీగల సురేష్‌బాబు

కోట, జూన్ 17 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన స్వర్ణయుగంలా ఉంటుందని తిరుపతి జిల్లా తెదేపా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు అన్నారు. ఆయన ఆదివారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ ,ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పించన్ల పెంపు తదితర వాటిపైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకాలు చేసి విశ్వసనీయుతను చాటుకున్నారన్నారు. వచ్చే ఐదుళ్లలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే బాధ్యతను ఎన్డీఏ సర్కారు తీసుకుంటుందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకొని ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చెప్పారు. ఎంతో నమ్మకంతో ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చారని అందుకు అనుగుణంగా గూడూరు శాసన సభ్యులు పాశం సునిల్ కుమార్ నాయకత్వంలో ముందుకు వేళ్లుతామన్నారు. ఆయన వెంట వెంకన్నపాళెం సర్పంచ్ కె.మదుయాదవ్, కోట పట్టణ తెదేపా అధ్యక్షులు షెక్.షంషద్దీన్, తదితరులు ఉన్నారు.

## గణనాధుని దర్శించుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి



**కాణిపాకం, జూన్ 17 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేంద్రకుమార్ సోమవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో భక్తి శ్రద్ధలలో బక్రీద్‌పండుగ

తవణంపల్లె, జూన్ 17 ప్రభాతవార్త:

బక్రీద్ పండుగ పర్వదినాన్ని సోమవారం మండలంలోని ముస్లిం సోదరులు సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని అరగొండ, తవణంపల్లె, తడకర, మత్యం, మైలవారిపల్లె, గాజులపల్లె, కృష్ణాపురం, పొన్నేదుపల్లె, తదితర గ్రామాలలోని ముస్లిం సోదరులు అరగొండ, గాజులపల్లె తదితర గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈమేరకు అరగొండ పరిసర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు అరగొండ నుండి జొన్నగురకల రోడ్డులోని ఈద్గా వరకు అల్లాహ్ అక్బర్ అంటూ ర్యాలీగా వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల నుండి ఈద్గాల వరకు ర్యాలీలు నిర ్వహించి ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈసందర భ ంగా మతగురువులు ఖురాన్ ప్రభోదాలను బక్రీద్ విశిష్టతను వివరించారు.

**ఐరాలలో...**

**ఐరాల, జూన్ 17 ప్రభాతవార్త:** మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రం ఐరాలలోని ముస్లింసోదరులు ఐరాలలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ఐరాల పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లింలు ఉదయం ఐరాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే స్థానిక ఈద్గాకు వెళ్ళి అక్కడ మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# శ్రీమూలస్థాన ఎల్లమ్మ పాలకమండలి రాజీనామా

చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త:
చారిత్రాత్మక చంద్రగిరిలో సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలక మండలి మూకుమ్మడి రాజీనామా చేశారు. ఆలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కరరెడ్డి సహకారం, అమ్మవారి ఆశీర్వాదంతో ఆలయ పునర్మిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా భక్తుల నుండి చందాల రూపేణా లభించిన రూ.1 కోటి ఆలయం తరపున టిటిడికి సమర్పించడంతో టిటిడి ఆలయ పునర్నిర్మాణానికి రూ.4 కోట్లు జతచేసి రూ.5 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా దేవాదాయ శాఖకు ఆలయం తరపున రూ.30 లక్షలు చెల్లించగా రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అమ్మవారి ఆలయ గోపురంపై కలశ స్థాపనకు రూ.10 లక్షలతో కలశం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చెవిరెడ్డి సహకారంతో



సుమారు రూ.2 కోట్లు వ్యయంతో తుడా తరపున ఆలయ ఆవరణలో బాలాలయం, అన్నదాన మండపం, మరుగుదొడ్లు, సిసి రోడ్లు నిర్మించడం జరిగిందనీ, అదేవిధంగా ఆలయం నుండి బైపాస్ వరకు సిసి రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. మా వ్యక్తిగత కారణాల రీత్యా పాలక మండలి మూకుమ్మడి రాజీనామాలను ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి సమర్పించినట్లు తెలిపారు.

**చరిత్రలో నిలిచే రీతిన యారాశి సేవలు**

విశ్రాంత ఉపాధ్యాయుడైన యారాశి చంద్రశేఖర్ రెడ్డి వయస్సు రీత్యా అనారోగ్యం కృంగదీసినప్పటికీ అమ్మవారి ఆలయ చైర్మన్‌గా చరిత్రలో నిలిచే విధంగా తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నారు. ఆలయ చైర్మన్‌గా భాధ్యతలు చేపట్టిన నాటి నుండి తనదైన శైలి పాలనకు శ్రీకారం చుట్టారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, భక్తు రద్దీ దృష్ట్యా ఆలయ పునర్నిర్మాణానికి కంకణం కట్టుకున్నారు. అలుపెరగని అమ్మవారి భక్తుడుగా భక్తుల నుండి, దాతల నుండి విరివిగా విరాళాలను సేకరించడంతో పాటు, నాటి ఎంఎల్ఏ సేవలను అందిపుచ్చుకున్నారు.

## రాజీవ్‌నగర్‌లో తొలివిడత ఆక్రమణలు పూర్తి

-మలివిడతకు సన్నాహాలు



తొట్టంబేడు, జూన్ 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని నిరుపేదలకు అందించిన 7వేల పట్టాల్లో 2763 బినామీ పట్టాలు అని అధికారులు గుర్తించారు. అయితే కాలనీకి అడ్డంగా రోడ్డు పక్కన కాలువ పోరంబోకులో నిర్మించుకున్న 51 అక్రమకట్టడాలు తొలగింపులో మొదటదిదశలో పూర్తిచేశారు. మలివిడతలో బినామీ పట్టాలు, క్రయవిక్రయాలకు సంబందించి ఎంఎల్ఏ దృష్టిసారించనున్నారు. బినామీలుగా గుర్తించిన పట్టాల వివరాలను రెవెన్యూ అధికారులు అందజేయాలని కోరినట్లు సమాచారం. పేదల హక్కును గత ఐదేళ్ళు రాజకీయ ముసుగులో కొందరు విచ్చలవిడిగా అనుభవించడాన్ని ఎంఎల్ఏ దృష్టిసారించారు. రాజీవ్‌నగర్ ప్రక్షాళనే ప్రధాన అజెండెంగా ముందడుగు వేస్తున్నారు. రాజీవ్‌నగర్‌లో అక్రమకట్టడాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించిన విషయం విదితమే. ఈనేపధ్యంలో గత మూడు రోజుల నుంచి అక్రమకట్టడాలను తొలగించడంలో రెవెన్యూ సిబ్బంది గత మూడు రోజుల నుంచి రాజీవ్‌నగర్‌లోనే అక్రమకట్టడాలను తొలగించారు. వీరితో పాటు టుటౌన్ సిఐ రారాజు, తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర, ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించి ఎలాంటి వివాదాలకు చోటులేకుండా ఆక్రమణలను తొలగించారు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పురపాలక ఉద్యోగి వద్ద 316 ఇంటిపట్టాలు ఉండగా పోలీసులు పట్టుకుని విచారించారు. వీటి భాగోతం కూడా బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరుపేదలకు కట్టుకోవడానికి స్థలాలు ఇస్తే ఆస్థలాలను కొందరు కబ్జాదారులు దర్జాగా ఆక్రమించుకుని నిర్మాణాలు ఎంచక్కా నిర్మించేశారు. దీనిపై ఎంఎల్ఏ దృష్టిసారించినట్లు సమాచారం. తొలివిడత ఆక్రమణలు పూర్తవగా, మలివిడత ఆక్రమణలపై ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి పక్కాగా దృష్టిసారించారు.

## కక్షపూరిత రాజకీయాలు చేయం

అభివృద్దే ఎన్డీఏ అజెండా , ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 17, ప్రభాతవార్త



నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని పెద్దకాపు లేవుట్‌లో కల్వర్ట్ కమ్ సర్వీస్ రోడ్డు నిర్మాణంకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమి పూజ నిర్వహించారు. సోమవారం ఉదయం శ్రీనివాసం కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న పెద్దకాపు లేవుట్ పరిధిలోని కల్వర్ట్ నిర్మాణం, 15 మీడర్ల సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ జరిగింది. పెద్దకాపు లేవుట్ సమస్యను టిడిపి 11వ డివిజన్ ఇన్చార్జి కంకణాల రజనీకాంత్ నాయుడు, ఈతమాకుల హేమంత్ కుమార్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పులుగోరు మురళీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పెద్దకాపు లేవుట్‌ను తిరుమల బైపాస్ రోడ్డును కలిపే సర్వీస్ రోడ్డు ప్రాంతాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఓట్లేశారని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కక్ష కట్టి పెద్ద కాపు లేవుట్‌కు సర్వీస్ రోడ్డు వేయకుండా అడ్డుకున్నారని అన్నారు. కల్వర్ట్‌లు పూర్తి చేయకుండా స్థానికులను, వ్యాపారవర్గాలను కరుణాకర్ రెడ్డి ఇబ్బందులుకు గురి చేశారని ఆయన ఆరోపించారు. తన మాట వినని వారు, లంచం ఇవ్వని వాళ్ళ పై కక్షతీర్చుకోవడం కరుణాకర్ రెడ్డి నైజం అని ఆయన విమర్శించారు. 22ఏ లో పెద్దకాపు లేవుట్‌ను చేర్చి ప్రజలను గత ప్రభుత్వం ఇబ్బందులు పాలు జేసిందని ఆయన చెప్పారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడుల దృష్టికి 22ఎ సమస్య తీసుకెళ్ళి పెద్ద కాపు లేవుట్ వాసులు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కక్ష పూరిత రాజకీయాలు తిరుపతిలో ఇకపై చెల్లవని అభివృద్దే ఎన్డీఏ అజెండా అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, మబ్బుదేవ నారాయణ రెడ్డి, జెబి శ్రీనివాస్, పొలకల మల్లిఖార్జున్, నవీన్ కుమార్ రెడ్డి, రాజా రెడ్డి వూకా విజయ్ కుమార్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ యాలమూరి శ్రీనివాసులు రెడ్డి, చినబాబు, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత్ కుమార్, సింగంశెట్టి సుబ్బరాయులు, గాలి పవన్ చౌదరి, మన్నె శ్రీనివాసులు, నెలవాయి మురళీ, సానె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్య శిబిరం

రేణిగుంట, జూన్ 17 ప్రభాతవార్త:
రేణిగుంట మండలం మామండూరు పంచాయతీ కుక్కల దొడ్డి(బలపల్లి) గ్రామంలో సోమవారం రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఆదేశాల మేరకు రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు సూచనల మేరకు ఏరియా వెటర్నరీ డా. స్రవంతి బృందం పశువులకు ఉచిత వైద్యం చేశారు. పంచాయతీ పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు తమ పశువులను శిబిరానికి తీసుకొచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, ప్రసాద్, అన్నగలన్, జ్యోతి, శంకరయ్య, స్వాతి, ట్రస్టీలు, క్లస్టర్ లీడర్లు, సంఘం లీడర్లు, గోపాలమిత్ర లోకేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డివిసత్రంలో వర్షం ...

దొరవారిసత్రం, జూన్ 17 ప్రభాతవార్త ;
మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం సాయంత్రం ఆదుగాలులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి భానుడు భగభగ మంటూ మండుతూ ఉండి సాయంత్ర సమయంలో ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు చోటుచేసుకొని ఉరుములు మెరుపులతో కూడన వర్షం కురవడంతో గ్రామీణ ప్రజలు ఎండతీవ్రత నుండి కొంతవరకు ఉపశమనం పొందారు. ఈవర్షాలు ఎడగారుసాగు చేపడుతున్న అన్నదాతలకు ఊరటనిస్తుంది. కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నారు. వర్షాలకు గ్రామీణరోడ్లు, వీదులు బురదమయంగా మారుతున్నాయి. గ్రామాల్లో వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అన్నా క్యాంటీన్ పున:ప్రారంభం

- సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల

చిత్తూరురూరల్, జూన్ 17 ప్రభాతవార్త:
ఎందరో పేదవాళ్ల కడుపు నింపిన అన్నా క్యాంటీన్లను పున:ప్రారంభించడం ఎంతో ఆనందంగా వుందనీ, మాట నిలబెట్టుకున్న ఏపి సిఎంకు చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద అన్నార్తులకు ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చిన పేదల పెన్నిధి సిఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు జీర్ణించుకోలేక వాటికి అడ్డుకట్ట వేసి పేదవాడి కడుపు కోతకు గురైందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు మళ్లీ అన్నా క్యాంటీన్లను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల .జగన్మోహన్ నేతృత్వంలో ప్రారంభించడం జరిగిందనీ, చంద్రబాబు సమర్థవంతమైన పాలనకు నిదర్శమని పేర్కొన్నారు.

## శివయ్య సేవలో 'కన్నా'

శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని నిత్యభక్తుడు సీనియర్ రాజకీయ నాయకుడు కన్నాలక్ష్మీనారాయణ. ఆయన ఎప్పుడు ఉమ్మడి చిత్తూరుజిల్లా పర్యటనకు వచ్చినా శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవటం ఆనవాయితి. ఈనేపధ్యంలో మంత్రిగా, బిజెపి నాయకుడుగా హాజరైన సత్యనపల్లి శాసనసభ్యుడుగా కన్నాలక్ష్మీనారాయణ సోమవారం తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడుగా కుటుంబసమేతంగా విచ్చేసారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్ సారధ్యంలో వేదపండితులు, మేళతాళాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు. ఏర్పాట్లును ఎఇఓ సతీష్‌మాలిక్, పిఆర్ఓ నాగభూషణం నాయక్, రవి, శ్రీనాథ్, సిఎస్ఓ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు. ఆయనకు దర్శనం ఏర్పాట్లను పివిఆర్ గ్రూప్‌కు చెందిన జనార్ధన్‌రావు పవార్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు న్యాయవాది వడకలూరు మస్తానయ్య, స్వామి, బిజెపికి చెందిన అమర్‌నాథ్, ఢిల్లిబాబులు పర్యవేక్షించారు.

## ఫ్లెక్సీలకు స్వస్తి:ఓం కారానికి శ్రీకారం

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక చింతనను కల్గించుటకు కొత్తగా గెలిచిన యువ శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పలు సంస్కరణలు చేపట్టారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాల యానికి దేశ విదేశాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతుంటారు. వారు నాలుగుమాడావీధుల్లోనూ, సన్నిధివీధిలోని లాడ్జిల్లో విడది చేస్తుంటారు. వారికి ఆధ్యాత్మిక చింతనతో కూడిన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ నేపధ్యంలో నాలుగు మాడావీదుల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లకు స్వస్తి చెప్పాలని ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని అధికారులు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. అలాగే పట్టణంలో అడుగుపెట్టిన వెంటనే ' భక్తుల హృదయాలు ఓం కార నాదంతో నిండాలని'కాబట్టి ప్రత్యేక మైకుల ద్వారా తిరుమల తరహాలో వినిపించాలని ఆదేశించారు. ఈ మేరకు నాలుగుమాడావీధుల్లో అధికారులు మళ్ళీ మైకులు ఏర్పాటు చేసారు.

## భోజనానికి తిప్పలు పడ్డ భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం ఇక్కడకు వచ్చే భక్తులు సుమారు 5వేల మందికి ఒక వేళకు భోజన వసతి కల్పించారు. భక్తులు సమర్పించిన కానుకలను బ్యాంకులో డిపాజిట్‌చేసి దాని మీద వచ్చే వడ్డీలతో ప్రతి రోజూ భోజనం వసతి కల్పిస్తున్నారు. అయితే గతంలో ఇక్కడ భోజన సదుపాయం గురించి మైకుల్లో ప్రచారం చేసే వారు. కానీ ప్రస్తుతం ఎందుకో?ఎవరి ఆదేశాలో? ఏమో కాని మైకుల్లో ప్రచారం చేయటం లేదు. సోమవారం శివరాత్రిని మరిపించే విధంగా భక్తులు తరలి వచ్చారు. కానీ భోజన వసతి తెలియక హోటళ్ళ మీద ఆధారపడటంతో తిండికి కకూడా తిప్పలు తప్పలేదు. భక్తులకు ఉపయోగపడే సమాచారాన్ని ఇవ్వటంలో ఎందుకో చొరవ చూపటం లేదు. ఇప్పటికైనా భక్తులకు ఉపయోగపడే సమాచారాన్ని మైకుల్లో తెలియజేస్తే ఎంతో ప్రయోజనకంగా ఉంటుంది. భక్తులు అభినందిస్తారు.

## పూతలపట్టు ఎంఎల్ఏను కలసిన తొట్టంబేడు నాయకులు

.తొట్టంబేడు, జూన్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనల మేరకు పూతలపట్టు ఎంఎల్ఏ మురళీమోహన్‌ను తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, నాయకులు కలసి ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని దుశ్శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం పూతలపట్టులోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు హాస్టల్ సీట్లు మరియు వసతిగృహం కల్పించాలని కోరడంతో స్పందించిన పూతలపట్టు ఎంఎల్ఏ వెంటనే స్పందించి డిసిఓకు చరవాణి ద్వారా సమాచారం అందించి హాస్టల్‌లో సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సాలిరాజ, యల్లసిరి, అశోక్, తిరుకాలహరిగౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 18 వ వార్డు బూత్ కమిటిని అభినందించిన సుధీర్

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓట్లు కొల్ల గొట్టడంలో బూత్ కమిటి ఏజెంట్లు కార్యకర్తల చొరవ వర్ణించలేనని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డు తెలుగుదేశం కార్యకర్తలు, 52 మంది బూత్ ఏజెంట్లను, జయరామారావువీధిలోని ముస్లిం యువకు లను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభినందించారు. బక్రీద్ సందర్భంగా వారిని ఆహ్వానించి అభినందించారు.

## ఏపిసీపిఎస్ఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

తొట్టంబేడు, జూన్ 17 ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షనరీ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతిజిల్లా నూతన కమిటీని సోమవారం పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న అతిథిగృహంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.శ్రీనాథ్ ఎన్నికల అధికారి సమక్షంలో ఎన్నికలు జరిపారు. ఇందులో ఏపిసిపిఎస్ఈఏ తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా రేగంటి దేవానంద్, ప్రధాన కార్యదర్శిగా పివి.సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రెడ్డిరాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మహిళా విభాగం కేంద్ర మహిళా అధ్యక్షురాలిగా సి.మంజుల, కార్యదర్శిగా జి.భారతీ, ఆర్థిక కార్యదర్శిగా పి.ఇందిరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ముందుగా నూతనంగా ఎన్నిక కాబడిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అత్యధిక సీట్లు సాధించి సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకి అభినందనలు తెలుపుతూ ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు భారంగా ఉన్న సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం ఏర్పరచిన జిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేవారు. నూతన కార్యవర్గ సభ్యులుగా యువకిషోర్, గౌరవసలహాదారుగా ఎస్.భాష, సహాధ్యక్షులు చెంగల్రాయులు, ఉపాధ్యక్షులుగా చాలచందర్, లక్ష్మిపతి, రాకేష్‌బాబు, పరంధామయ్య, సుధాకర్, ట్రెజరర్‌గా రెడ్డిరాణి, వర్కింగ్ అధ్యక్షుడుగా మునస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లుగా అల్లూరయ్య, సలీం, విజయలక్ష్మి, ఈశ్వరయ్య, టి.శ్రీనాథ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# తిరుపతి డివిజన్

## చంద్రగిరి ఎమ్మెల్యేను కలిసిన పూతలపట్టు ఎమ్మెల్యే



తిరుపతిరూరల్, జూన్ 17 ప్రభాతవార్త:
చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళిమోహన్ మర్యాదపూర్వకంగా కలిసి, ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర సివిల్ సప్లయ్ మాజీ చైర్మెన్‌కు సైకంకు సన్మానం



తిరుపతిరూరల్, జూన్ 17 ప్రభాతవార్త:
రాష్ట్ర సివిల్ సప్లయ్ మాజీ చైర్మెన్ సైకం జయచంద్రారెడ్డిని తిరుమలనగర్ పంచాయతీ ప్రజలు ఘనంగా సన్మానించారు. టిడిపి గెలుపుకోసం తనవంతు కృషి చేయడంతో పాటు నియోజకవర్గం వ్యాప్తంగా అనుచరులచే సైనికుల పని చేయించి గెలుపుకు కృషి చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రహ్లాద, హరికృష్ణ, సుధాకర్, రాజశేఖర్, కుమార్, సునీల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సున్నపు కుండలు వేషంతో మిట్టగంగమ్మకు మొక్కులు

అమ్మవారికి పసుపు నీళ్ళ అభిషేకం



చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త:
సున్నపు కుండలు వేషధారణలతో భక్తులు శ్రీ మిట్టగంగమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరిలోని శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 7వ రోజు సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బు స్వామి, అలంకరణ నిర్వాహకులు ఉగ్రాణం సుబ్రమణ్యం రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం అమ్మవారికి భక్తులు సున్నపుకుండలు వేషంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి పసుపునీళ్ళతో అభిషేకం జరిపించారు. అదేవిధంగా శ్రీ పొలిమేర దేవత అంకాలమ్మ, గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవతలకు జాతర ఆహ్వాన సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ నాటి కార్యక్రమాలకు చంద్రగిరికి చెందిన టిడిపి నాయకులు, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, ఎ టు జడ్ డెవలప్‌మెంట్స్ అధినేత రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, విజయవాడకు చెందిన ఏఈఈ పి.సుజాత ఉభయదారులుగా వ్యవహరించారు.

## తిరుపతి జిల్లా బలిజ సేన అధ్యక్షులుగా చెరుకుల నీలాద్రి నియామకం

తిరుపతి విద్య, జూన్ 17, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా బలిజ సేన జిల్లా అధ్యక్షులుగా చెరుకుల నీలాద్రిని నియమించడం జరిగిందని బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా తిరుపతి జిల్లా బలిజ సేన అధ్యక్షులుగా ఎన్నికైన చెరుకుల నీలాద్రి మాట్లాడుతూ జిల్లాలోని బలిజల సమస్యలపై పోరాడుతానని, వారి ఆర్థిక సామాజిక తదితర విషయాలలో ముందుండి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఈ పదవిని అప్పగించిన బలిజ సంఘ నాయకులకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## జర్నలిస్టు డా. జనార్ధన్‌కు ఘన సన్మానం

ఆత్మీయుల అభినందన

తిరుపతి, జూన్ 17, ప్రభాతవార్త
సీనియర్ జర్నలిస్టు కమ్యూనిస్టు నేత సేవా తత్పరుడు బహుముఖ ప్రజ్ఞాశాలి తూపల్లె జనార్దన్‌కు ఇటీవల ఎస్వీ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన పట్ల సీనియర్ జర్నలిస్టులు సోమవారం సిపిఐ కార్యాలయంలోని గ్రంథాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టు గుండ్రాజు సుకుమార్ రాజు ఆధ్వర్యంలో ఆత్మీయ స్నేహితులు దగ్గర సన్నిహితులు హాజరై అభినందనలు తెలియజేశారు. సుదీర్ఘకాలం తర్వాత డాక్టరేట్ పొందడం ఆయన పట్టుదలకు నిదర్శనమని పట్టువీడని బట్టి విక్రమార్కుడిలా డాక్టరేట్ డాక్టరేట్ సాధించడం ఆయనకే సాధ్యమని ఆయన సన్నిహితులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి నాయుడు, జర్నలిస్టు నేతలు, నరేందర్ రెడ్డి, ఆదిమూలం శేఖర్, లక్ష్మీపతి, చంగల్ రాయులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు మంజునాథ్ చిత్తూరు సిపిఐ రైతు సంఘం నేత నాగరాజు తదితరులు డాక్టర్ జనార్ధన్ అకుంఠిత దీక్షతో సాధించిన డాక్టరేట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అబినందనలు తెలియజేశారు. వీరితో పాటు పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే నాని సతీమణి సుధారెడ్డి, డాక్టర్ జనార్ధన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## ఎంఎల్ఏను సత్కరించిన పాలకులు, మత గురువులు

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని సోమవారం ఈదులగుంట ఈద్‌గాహ్ వద్ద ఓ వైపు కమిటి తరపున మరో వైపు మత గురువులు ఆశీర్వ దించారు. బక్రీద్ పండగ సందర్భంగా ఆచరించి ఈదుల్ అజ్‌హా ప్రార్థనల సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుటకు సుధీర్‌రెడ్డి ఈద్‌గాహ్‌లకు వచ్చారు. మొదట ఈదుల గుంట తరువాత అయ్యలనాడుచెరువుల్లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను జామియా మస్జిద్ ముతవల్లి హాజీ అక్రం సాహెబ్ శాసనసభ్యుడుగా అత్యధిక మెజారిటితో గెలిచి మొదటి సారి అధికార హోదాలో వచ్చిందుకు సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యలను వివరించారు. కాగా మత గురువు ముఫ్తీ నయిం సాహెబ్ ఆయనకు దుశ్శాలువను కప్పి ఆశీర్వదించారు. కాగా ఇక్కడ జరిగిన కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తమ తప్పులు, తప్పిదాలను క్షమించమని వేడుకునే ప్రార్థనల్లో (దువా) కార్యక్రమాల్లో సుధీర్‌రెడ్డి ఆయన అనుచరులు పాల్గొన్నారు. జామియా మస్జిద్ కమిటికి చెందిన కమిటి అధ్యక్షులు హాజీ బియస్ అక్రమ్ సాహెబ్, ఖలీలుల్లా హుసేని, అంజద్ బాషా, ఉమర్, హమీద్, తాజుద్దీన్, శ్రీకాళహస్తి ఖాజీ మున్నాభాయ్‌లు సత్కరించారు. ఎంఎల్ఏతో పాటు పట్టణ అధ్యక్షుడు జి.విజయ కుమార్, మునిరాజానాయుడు, మైనారిటి నాయకులుషాకిర్ అలి, షఫీ, జిలాని, ఖాదర్‌బాషా, మస్తాన్, ఖలీల్‌బాషా, బషీర్, అస్మత్, సిఎస్ మస్తాన్, కరీం, ఖాదర్‌వలి, మీర్జా, తహలీల్, ఆరిఫ్, ముజీబ్, సాజిద్, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

దొరవారిసత్రం, జూన్ 17 ప్రభాతవార్త
రోడ్డుప్రమాంలో తీవ్రంగా గాయపడి చెన్నై విజయహస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యువకుడు బెల్లంకొండ చంద్రశేఖర్(25) సోమవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 12న దొరవారిసత్రం జాతీయరహదారిపై జరిగిన రోడు ప్రమాధంలో చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై విజయహస్పిటల్‌కు తర లించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

**CHANGE OF NAME**

**TADIKONDA RAJAMMA**, (old Name) R/o, 16-4-614, Aditya Nagar, Velagachettu Sangam, Nellore DT AP. Have Changed My Sur Name as **THATIKONDA RAJAMMA** (New name), W/O THATIKONDA VENKATESWARLU

**TADIKONDA VENKATESWARLU**, (old Name) R/o, R/o, 16-4-614, Aditya Nagar, Velagachettu Sangam, Nellore DT AP. Have Changed My sur Name as **THATIKONDA VENKATESWARLU** (New name), **S/O THATIKONDA KOTAIAH**

# రికార్డు స్థాయిలో అభిషేకాలు:రాహుకేతుదోష నివారణ పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం కిట కిట లాడింది. భక్తులు సునామిలా కదలి వచ్చారు. సోమవారం వేకువ జాము నుంచి కదలి తరంగాల్లా భక్తులు కదలి వచ్చారు. సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజుంటారు. శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి అభిషేకాలు జరిపించుకొనుటకు పోటీలు పడ్డారు. సామాన్యభక్తుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అంచనాలకు మించి భక్తులు రావటంతో సుదర్శనం, సత్వర దర్శనం ప్రకటనలకే పరిమితమైంది. అధికారులు ఆదివారం సాయంత్రం అందించిన సమాచారం మేరకు 30వేలకు పైగాభక్తులు హాజరైనట్లు తెలిపారు. ఇక ఒక్కసారిగా అధికారులు, సిబ్బంది గుక్కతిప్పుకోలేని పరిస్థితి చోటు చేసుకుంది. ఒక్కొక్క కాలానికి పది మంది భక్తుల్ని అనుమతిస్తేనే



సుదర్శనం సాధ్యం కాదు. అలాంటిది సోమవారం స్వామి అమ్మవార్ల అభిషేకాలు 295 జరిగినట్లు ప్రకటించారు. ఇక సాయంత్రం

**పర్యవేక్షణ ఉన్నా భక్తుల్లో అసంతృప్తి**

నిర్వహించే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 87 జరిగాయి ఇక రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి పరిశీలిస్తే రూ.500ల పూజలు 3631 రూ.750ల పూజల టిక్కెట్లు 1869 రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్న వారు 597 రూ.2500ల పూజలు 393 రూ.5వేల పూజలు 98 జరిగాయి. ఇక సంస్కరణలతో ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతుంది. సోమవారం ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 8730 మంది. అంటే సంస్కరణల తరువాత ప్రవేశ టిక్కెట్లతో శివయ్య ఆదాయాలు పెరుగుతున్నాయి.

## త్యాగం, దాన గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 17 ప్రభాతవార్త: ఎస్వీ యూనివర్సిటీ సమీపంలోని ఈద్గా మైదానంలో బక్రీద్ సందర్భంగా ముస్లింల ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ అసూయ, ద్వేషం వీడి త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ అలవరుచు కోవాలన్నారు. ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండగల్లో బక్రీద్ ఒకటని ఆయన చెప్పారు. త్యాగ గుణంతో పాటు దాన గుణాన్ని చాటే బక్రీద్ సారాంశాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన కోరారు. ఎన్నికల్లోనే రాజకీయాలు అని ఎన్నికల తరువాత అభివృద్ధి పై దృష్టి నిలిపామన్నారు. ముస్లింల సమస్యలను ఒక సోదరుడుగా పరిష్కారిస్తాని ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈద్గా స్థల వివాదాన్ని పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని ఆయన మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు మహబూబ్ బాషా, అలీ ఖాన్, షేక్ అర్షద్, రఫీ, హరూన్, ఖాజా మోహిద్దీన్, ముస్లీం జేఏసి చైర్మన్ ముర్తూజ, సింగం శెట్టి సుబ్బరాయులు, టిడిపి పట్టణాధ్యక్షులు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు నుండి మొదటి అన్న క్యాంటీన్ ప్రారంభం

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త: అధికారంలోకి వస్తే మళ్ళీ అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తామని ఎన్నికల్లో సిఎం నారా చంద్ర బాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సోమవారం రాష్ట్రంలో చిత్తూరు నుండి మొదటి అన్న క్యాంటీన్ ప్రారంభోత్స వం చేస్తున్నా మని ఎమ్మెల్యే గురజాల జగన్మోమన్‌నాయుడు అన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చిత్తూరు ఎస్టేట్‌లోని అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిం చాలని నిర్ణయించారన్నారు. రానున్న రోజుల్లో చిత్తూరు నగర పరిధిలో అన్న క్యాంటీన్లు ప్రారంభించి నగర పరిసర ప్రాంతాల్లోని దినసరి కూలీలు, నిరుపేదలకు 5 రూపాయలకు నాణ్యమైన భోజనం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిత్తూరు నగర పరిధిలోని దినసరి కూలీలు, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పని చేసే వారికి రూ.5కే ఉదయం టిఫిన్, రూ.5కే మధ్యాహ్నం భోజనం అన్న క్యాంటీన్‌లో లభిస్తుందన్నారు. చిత్తూరులో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిం చడానికి ముందకు వచ్చిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును కలెక్టర్ అభినందించారు. అన్న క్యాంటీన్‌ను కూలీలందరు వినియోగించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో అన్న క్యాంటీన్లకు మంచి ప్రాముఖ్యత వుండేదని, ప్రస్తుతం మళ్ళీ ప్రభుత్వం ఈ క్యాంటీన్లను పునఃప్రారంభించడంతో కూలీల కడుపు తక్కువ ధరతో నిండుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. అలాగే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మాజీ మేయర్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ .రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్‌లు అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గురజాల

## సముద్రపు ముఖ ద్వారాల పూడికతీతకు కృషి



వాకాడు, జూన్ 17 ప్రభాతవార్త: ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో గతంలో ఆగిన పనులన్ని పూర్తి చేసే విధంగా తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, బిజెపి సీనియర్ నాయకుడు వెలగపల్లి వరప్రసాద్ రావు అన్నారు. సోమవారం వాకాడులోని ఇరిగేషన్ అతిధి గృహంలో ఆయన స్థానిక విలేకరులతో ఆంధ్రాలో చంద్రబాబు నాయకత్వం, కేంద్రంలో మోడీ నాయకత్వం అభివృద్ధి చెందుతాయని అన్నారు. తాను, గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో కలిసి మండలంలోని తీర ప్రాంత గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. సునీల్‌తో కలిసి తాను చేయవల్సిన పనులు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి తీర ప్రాంత గ్రామాలలో వైల్డ్ లైఫ్ యాక్ట్‌ను తొలగించే విధంగా చర్యలు తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సముద్రంలోని బోట్లో కొందూరు, పాలెం నుండి తూపిలి పాలెం వరకు వెళ్లి సముద్రం ముఖ ద్వారలని కూటమి నాయకులతో వెలగపల్లి వరప్రసాద్ రావు పరిశీలించారు. ఈ సమావేశంలో గూడూరు బిజెపి సీనియర్ నాయకుడు పాపారెడ్డి పురుషోత్తం, మండల టిడిపి కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు వంక రమణయ్య, బిజెపి నాయకుడు పామంజి కృష్ణయ్య, రవి నాయుడు, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## పట్టణంలో ఘనంగా బక్రీద్ వేడుకలు



పలమనేరు, జూన్ 17 ప్రభాతవార్త: పలమనేరులో ఘనంగా బక్రీద్ వేడుకలను మైనారిటీ సోదరులు నిర్వహించుకున్నారు. ఉదయం పట్టణంలోని పలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మైనారిటీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అమనాథరెడ్డిను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నాగేశ్వర రాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజా, నాయకులు ఆర్‌వి.బాలాజీ, బైరెడ్డిపల్లె మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కుట్టి తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా నిత్యవసర వస్తువుల ప్యాకింగ్ తూనికలు

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త: చౌకదుకాణాల ద్వారా వినియోగదరులకు అందించే పంచదార, కందిపప్పు, పామ్ ఆయిల్ తదితర నిత్యవసర వస్తువుల ప్యాకింగ్ తూనికలు పక్కాగా వుండాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదివారం చిత్తూరు ఇరువారం, బంగారుపాళ్యం మార్కెట్ యార్డు వద్ద గల ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జయింట్ కలెక్టర్ ఎంఎల్ఎస్ పాయింట్లలో చక్కెర, పామాయిల్, కందిపప్పు తదితర నిత్యవసర వస్తువుల ప్యాకింగ్ తూకాలను పరిశీలించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్యాలయం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలోని అన్ని మండల స్థాయి గోదాముల్లో నిల్వ వున్న పంచదార, కందిపప్పు, పామాయిల్ ప్యాకింగ్ పరిమాణం నిర్ధారించాల్సి వుందన్నారు. ఈ మేరకు తన ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 11 బృందాలను నియమించి అన్ని గోదాములు పరిశీలించి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయంకు తగు నివేదికలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిఎం మోహన్‌రావు, చిత్తూరు అర్డీఓ చిన్నయ్య, చిత్తూరు, బంగారుపాళ్యం సిఎస్‌డిటిలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షునిగా డా.కరుణాకర్



సదుం, జూన్ 17 ప్రభాతవార్త : అన్నమయ్య జిల్లా ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా మదన పల్లెకు చెందిన రచయిత, దర్శకుడు అయిన డాక్టర్ కరుణాకర్ ఆరమడకను నియమించారు. ఈమేరకు ఆయనకు సోమవారం మన ఫిల్మ్ చాంబర్ఆఫ్ కామర్స్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు జె.యస్. రాజేంద్ర కార్యదర్శి వాసవి నియామక పత్రాన్ని అందజేశారు. కరుణాకర్ మాట్లాడుతూ ఉభయ చిత్తూరు జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాలోని అందమైన లొకేషన్లను సినిమా ఇండస్టీకి పరిచయం చేస్తానన్నారు. ఉభయ జిల్లాలోని కళాకారులకు గుర్తింపు కార్డులు అందించడం, అదేవిధంగా వారి అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వీలైనంత మేరకు ఈప్రాంతంలో షూటింగులు జరిపేందుకు కృషి చేస్తామని అదేవిదంగా స్థానిక కళాకారులకు తగిన గుర్తింపు నిచ్చి వారికి పలువురుకి సినిమాలలో ఛాన్స్‌లు ఇపి ్పంచడం, ఇతర శాఖలలో పనులు ఇప్పించడం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను మదనపల్లెకు చెందిన పలువురు కవులు, కళాకారులు, సినీ రచయిత కటారి రామయ్య, నటుడు దళవాయి గురప్పనాయుడు, తెలుగు, తమిళ, కన్నడ నటుడు పుంగనూరు జెమినీలు అభినందించారు.

## కూటమి గెలుపుతో తిరుమలకు పాదయాత్రగా కొత్తగొల్లపల్లె గ్రామస్థులు



తవణంపల్లె, జూన్ 17 ప్రభాతవార్త: ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుతో మొక్కులు తీర్చుకునేందుకు మండలంలోని నల్లిశెట్టిపల్లె గ్రామ పంచాయతీ కొత్తగొల్లపల్లెకు చెందిన టీడీపా నాయకులు, కార్యకర్తలు సోమవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్ళారు. పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గం నుండి కూటమి అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్, రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబునాయుడు గెలు పొందితే తిరుమలకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున ్న మొక్కులు తీర్చుకునేందకు సోమవారం గ్రామంలోని నాయకులు కార్యకర్తలు కాణిపాకం మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్ళారు. వీరిని స్థానిక మాజీ జడ్పీటీసీ వెంకటేష చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌నాయుడు, నాయకులు దిలీప్.ఏకాంబరనాయుడు, చిట్టెమ్మ, రాధాకృష్ణ తదితరులు కాణిపాకంలో కలుసుకుని సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## త్యాగ నిరతికి నిదర్శనం బక్రీద్ పండగ

**- ముస్లిమ్స్‌తో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని**



తిరుపతిరూరల్, జూన్ 17 ప్రభాతవార్త: త్యాగ నిరతికి నిదర్శనం బక్రీద్ పండగ అని, ప్రతి ఒక్కరూ దాన, సేవా గుణాలను అలవర్చుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. బక్రీద్ పండగ పర్వ దినాన్ని పురస్కరించుకుని చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా వున్న ముస్లింలు సోమవారం బక్రీద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. తిరుపతిరూరల్ మండలం మంగళం, బి.టి.ఆర్ కాలనీలలో మజీద్‌లలో జరిగిన మత ప్రార్థనలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత మొదటి పండగ బక్రీద్ అని పులివర్తి నాని తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోత్సవ త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండగను జరుపుకుంటారని తెలిపారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా మైనార్టీలందరూ భక్తిశ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకుంటారని తెలిపారు. అనంతరం ముస్లింలకు ఎమ్మెల్యే నాని శుభాకాంక్షలు తెలిపారు.

## చిందేపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించండి



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 17 ప్రభాతవార్త: మండలంలోని చిందేపల్లిరోడ్డు సమస్యను పరిష్కరిం చాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటను గ్రామస్తులు కోరారు. సోమవారం గ్రామస్తులు ఆమెను జనసేన పార్టీ కార్యాలయంలో కలసి గ్రామంలోకి వెళ్ళే రోడ్డు సమస్యను పరిష్కరించమని ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి తమ గ్రామానికి వెళ్ళే రోడ్డు పునః ప్రారంభం చేయాలని కోరారు. ఈసియల్ ఫ్యాక్టరీ గత ఏడాది చిందేపల్లి రోడ్డును అక్రమంగా ఆక్రమించుకుని 75సంవత్సరాలుగా గ్రామానికి వెళ్తున్న రోడ్డును మూసివేయించారని రోడ్డు సమస్య కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహారదీక్ష చేసి పోరాడిన జనసేన ఇన్‌ఛార్జి వినుత కోటను గ్రామస్తులు కోరారు. గతంలో పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు చిందేపల్లికి ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ విచ్చేసి సమస్యను పరిష్కరించేలా చేస్తామని వినుత కోట గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిందేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆత్మీయుని ఇంట్లో ఆతిధ్యం స్వీకరించిన కన్నా



శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనానికి సోమవారం సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నాలక్ష్మినారాయణ విచ్చేశారు. ఆయన తన చిరకాల మిత్రుడు అందరివాడు స్వర్గీయ శాంతారాంజె.పవార్ ఇంట్లో ఆతిధ్యం స్వీకరించారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించే పవార్ కుటుంబం అంటే తనకు ఎంతోఅభిమానం అని కన్నా అన్నారు. రాజకీయాల్లో మార్పులు వస్తుంటాయి, పోతుంటాయని వాటిగురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మంచితనానికి మారుపేరైన శాంతారాంజెపవార్ మన మధ్య లేకపోవడం తీరని లోటుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుటుంబానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పివిఆర్ గ్రూప్ డైరెక్టర్ జనార్ధన్‌రావు జె.పవార్, సిద్ధార్థ్ జె.పవార్, జివి.రమణమూర్తి(స్వామి), పదోక్లర్ మహేశ్వరరావు, రమణ, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లాహు అక్బర్ నామంతో మారుమోగిన రేణిగుంట



రేణిగుంట, జూన్ 17 ప్రభాతవార్త: ముస్లింలకు అతి పవిత్రమైన బక్రీద్ పండుగను పురస్కరించుకుని రేణిగుంట పట్టణం, మండలంలోని వివిధ ఈద్గాల్లో ముస్లిం మైనారిటీ సోదరులు అట్టహాసంగా పండుగను జరుపుకున్నారు. ఐదు మసీదుల ముత్తవల్లిల ఆధ్వర్యంలో మైనారిటీ సోదరులు రేణిగుంట పెద్ద మసీదు వద్ద ఏకమై ఊరేగింపుగా అల్లాహ్ పవిత్ర నామాన్ని స్మరించుకుంటూ ఈద్గా మైదానానికి చేరుకున్నారు. కుల మతాలకతీతంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానాల నిర్వహించారు. ఇంటి వద్ద తయారు చేసుకున్న బిర్యాన్ని పేద ముస్లింలకు పంచిపెట్టారు. పార్టీలకు అతీతంగా మైనారిటీ సోదరులంతా ఈద్గా వద్ద ప్రార్థనలు జరిపారు. ఈద్గాకు వచ్చిన మైనారిటీ సోదరులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ముస్లిం మైనారిటీ నేతలు రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మనీర్ జీకే, అఫ్రోజ్, నవాబు, షరీఫ్, రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, జిల్లా టీడీపీ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు పుష్పనాథం, సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగేశ్వరరావు, కన్నన్‌రెడ్డి, రవికిరణ్, సుమన్, వయ్యనాయుడు, గజేంద్ర తదితరులు సీతల పానీయాలు, తాగునీరు, మిఠాయిలు అందజేశారు.

## మామిడి రైతు నిలువు దోపిడి

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త: మామిడి రైతులను గుజ్జు పరిశ్రమల యాజమానులు నిలువు దోపిడి చేస్తున్నారని, తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.30 వేలు ఇవ్వాలని రాష్ట్ర సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ కమిటీ సభ్యులు ఆర్.హరికృష్ణ అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి పంట మరింత దెబ్బతిందని, పంట దిగుబడి తగ్గిందన్నారు. గుజ్జు పరిశ్రమల యాజమానులు, వ్యాపారులకు కుమ్మక్కై రైతును నిలువుగా దోచుకుంటున్నారని ఆరోపించారు. తోతాపురి ధర టన్ను రూ.28 వేలు పలుకుతున్నప్పటికీ ఇక్కడ కేవలం రూ.23 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. తోతాపురి మామిడి టన్నుకు రూ.30 వేలు చెల్లించి రైతును ఆదుకోవాలని ప్రభుత్వంను ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, సీనియర్ నాయకులు వెంకటరత్నం, వెంకటయ్య, ఉమాపతినాయుడు, వెంకటరమణారెడ్డి, సుదర్శన్‌నాయుడు, మహిళా సంఘ నాయకురాలు లత తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



నగరి, జూన్ 17 ప్రభాతవార్త: ముస్లిం సోదరులకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నారన్నారు. భక్తిభావం, కరుణ, సహనాన్ని బక్రీద్ చాటి చెబుతుందని, త్యాగానికి ప్రతీకగా ఈ బ్రకీద్ పండుగను జరుపుకుంటారని, మహ్మద్ ప్రవక్త బోధనలు, విధానాలు అందరికి అనుసరణీయమని తెలిపారు. అందరికి అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



వడమాలపేట, జూన్ 17 ప్రభాతవార్త: బక్రీద్ పండుగను వడమాలపేట మండలంలోని ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మసీదుకు వెళ్లి నమాజ్ చేశారు. ఒకరినొకరు ఈద్గా ముబారక్ శుభాకాంక్షలు తెలుసుకున్నారు. ముత్తవల్లి బాబు సాహెబ్ పండుగ విశిష్టతను, ప్రత్యేకతను వివరించారు. సమాజంలో ప్రతిఒక్కరికి మంచి జరగాలని ప్రార్థనలు చేశారు. వడమాలపేట, చింతకాల్వ, వెంగళరాజు కండ్రిగ, పచ్చికాల్వ, పూడి, బాలినాయుడు కండ్రిగ గ్రామాల్లోని ముస్లిం సోదరులు పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## రెండు బైక్‌లు ఢీ - ఒకరు మృతి

కేవీబీ పురం, జూన్ 17 ప్రభాతవార్త: రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన కేవీబీ పురంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మృతుడు కె.మునస్వామి(35) అత్తగారిల్లు రాగిగుంటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదం సంభవించి మృతి చెందాడు. కేవీబీ పురం నివాసి ముస్లిం సోదరుడు, మృతుడు మునస్వామి ఇరువురు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడ్డ ముస్లిం సోదరుడు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి మహ్మద్‌షరీఫ్ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చిత్తూరు ఈద్గాలో నమాజు అనంతరం ముస్లీంలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

- ప్రభాతవార్త, చిత్తూరు

## టి.పుత్తూరు వైభవంగా కోదండరాముని ధ్వజారోహణం



కోదండరామాలయంలో జరిగిన ధ్వజారోహణం

తవణంపల్లె, జూన్ 17 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమంను అత్యంత వైభవోపేతంగ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పి.సిద్దేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన అంకుర్పాణ కార్యక్రమంలో వార్షిక బ్రహోత్ ్సవాలు ప్రారంభం కాగా సోమవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంసవాహనసేవ కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు ఆలయంలోని ధ్వజస్థంభంకు అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గరుక్మంతుని పటాన్ని ధ్వజస్థంభంపై ఎగువ వేశారు. అనంతరం మరోమారు ధ్వజస్థంభానికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యమ్రానికి చిత్తూరుకు చెందిన ఆదినారాయణరెడ్డి, ఎఎన్.సుభాష్, ఎ.ధనూజ్‌కుమార్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు.

**హంసవాహనంపై ఊరేగిన కోదండరాముడు :**

దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి సీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమానికి టి.పుత్తూరుకు చెందిన కెఎన్.అరుణాచలపిళ్లే, కె.కరుణకుమార్ అండ్ బ్రదర్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన హంసవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర ్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉబయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## షాదీమహల్స్‌కు మహర్థశ! ముస్లింలకు శాసనసభ్యుడు వరాలు



శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఒక్కొక్క మండలానికి ఒక్కొక్క షాదిమహల్స్‌ను, ఒక్కొక్క ఈద్‌గాహ్‌కు స్థలాలను తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంజూరు చేయించారని వాటిని అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఈదుల గుంట, అయ్యలనాడు చెరువుల్లోని ఈద్‌గాహ్‌ల వద్ద బక్రీద్ శుభాకాంక్షలను తెలుపటానికి వచ్చిన శాసనసభ్యుడు ముస్లింలను వరాల వరదలో ముంచెత్తారు. తాను మాటలతో సరిపెట్టనని ఆచరణలో చేసి చూపుతానని సుధీర్‌రెడ్డి వివరించారు. ఈదుల్ గుంటలోని ఈద్‌గాహ్ ప్రహరీ గోడనిర్మాణానికి సంబంధించి అధికారులతో చర్చించి నిధులు సాధిస్తామన్నారు. అంతేకాక షాదీమహల్‌కు చక్కటి రూపకల్పన చేస్తామన్నారు. వేలాది మంది ప్రార్థనలు చేసే ఈద్‌గాహలలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. మానసిక ప్రశాంతతో ప్రార్థనలు జరుపుకొనుటకు ఎసి రేకులతో శాశ్వత షెడ్డులు నిర్మిస్తామన్నారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓ క్రికెట్ గ్రౌండ్‌ను కూడా తయారు చేయిస్తానని వివరించారు. ఇక చిరువ్యాపారులకు బ్యాంకు రుణాలతో పాటు గతంలో తెలుగుదేశం పార్టీ అందించే రంజాన్ తోఫా, దుర్హన్ పథకంలో ఆర్థిక చేయూతలను అందిస్తామన్నారు. తనకు బొజ్జల కుటుంబానికి ఆది నుంచి శ్రీకాళహస్తిలోని ముస్లింలు ఆటాచ్‌మెంట్‌తో ఉన్నారని అదే సహకారం ఈ సారి ఎన్నికల్లో తనకు 43వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారని మీ యువకులకు చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వెత్తలతో చర్చించి ఉపాధి ఆవకాశాలను కల్పిస్తామన్నారు. తనకు మీరు ఓటు ద్వారా మిమ్ములను పరిపాలించే బాధ్యతను అప్పగించారన్నారు. అయితే తానేదో ఎంఎల్ఏని అని అనుకోకుండా ఏదైనా సమస్య ఏర్పడితే తాను కూడామీ కుటుంబంలో ఒక్కడిగా భావించి తన దృష్టికి తీసుకురావాలని సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆయనతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, మాజీ పాలసరఫరా సంఘం అధ్యక్షుడు రావిళ్ళమునిరాజానాయుడు, అస్మత్, షాకిర్ అలీ, ఖాదర్‌బాషా, ఖలీల్ బాషా, బషీర్, దుర్గా ప్రసాద్, కంఠారమేష్, కాసరం రమేష్ తదితరులున్నారు.